ఆత్మార్పణ చేసుకొనే శక్తి స్త్రీకి పుట్టుకతోనే అలవడుతుంది. ఇంతటి త్యాగ ధనంతోపాటు స్త్రీలో స్వార్థం పరాకాష్ఠనందడం మరొక విశేషం. ఈ రెంటికి వైరుధ్యమూ లేదు. తనది అని నమ్మిన దానిని దక్కించుకొనడానికి స్త్రీ ఎంతకైనా తెగిస్తుంది.

---

**ఉద్యోగ ధర్మ** నిర్వహణ రీత్యా, నేను నాగూరు వెళ్ళటం అదే ప్రప్రథమం. కాని, తళతళ మెరిసే కంటి చూపులతో మంచినీళ్ళు తెచ్చే అందమైన ఆ అమ్మాయిని అక్కడ, అలా చూడటం మాత్రం అది రెండవసారి.

పాతిక సంవత్సరాల వయసు ఉన్న ఆ అమ్మాయిని మొట్టమొదటిసారి పుంగనూరు గంగజాతరలో చూశాను. నే నామెను చూసి వేలాదిమంది మధ్య ఉన్నా, కేవలం చిరునవ్వుతోనే నా మనసును అమాంతంగా ఆకట్టుకుందామె. ఆమె పేరు పద్మలత.

ఒడుపు చూసి, ఆమె హృదిలో గూడు కట్టుకొని, తోడుగా, నీడగా జీవిద్దామనుకొని ఆశిస్తుంటే, చేదుతలా నిర్దయగా నన్ను నెట్టివేసి, నా ప్రయత్నానికి అడ్డుకట్ట కట్టేసి, కళ్ళలో నిప్పులు గుప్పించింది. కారణం—ఆనాడు గంగజాతరలో కాకతాళీయంగా జరిగిన ఓ సంఘటన.

పుంగనూర్లో గంగజాతర చాలా అట్టహాసంగా, చాలా వేడుకగా జరుగుతుందంటే చూడటానికి వెళ్ళాను. వెళ్ళిందే తడవుగా ఇద్దరు స్నేహితులు జతకలిశారు.

హోటల్లో కాఫీ, ఫలహారాలు సేవించి, ఇద్దరు స్నేహితులూ నేనూ కలిసి గుడి ముందర ఉన్న గంగమ్మ గుడి దగ్గర పోయి నించున్నాం.

నా ఇద్దరు స్నేహితులూ మామూలోళ్ళు కాదు. చంద్రశేఖరమేమో మితభాషి. అత్యవసరమయితే తప్ప నోరుతెరిచి ఓ మాట అనవసరంగా అనడు.

హర్నాథేమో కళాపిపాసి. అందమైన అమ్మాయి అతనిముందు నడయాడుతుంటే అతనే లోకంలో ఉన్నాడో, ఏమి మాట్లాడుతున్నాడో, ఏం చేస్తున్నాడో తనే ఎరగడు.

కృష్ణ ఏమో వాగుడుకాయ. లోకంలోని ప్రతి సంగతీ తనకే కావాలి, ఆ విషయంగా చర్చించి, కొంచెం దూరం లోకానికి వెళ్ళి ప్రతి సంఘటనా మహాకార్యం తన భుజస్కంధాలపై ఉన్నట్టు మాట్లాడేస్తుంటాడు.

ఇకపోతే నా సంగతి. అందమైన ఏ వస్తువు కాని, ఏ దృశ్యం కాని నాకు అమిత ఇష్టం. కాని, వదిలితే నన్నే సంగతి—అమ్మాయిలంటే మాత్రం నాకు కాస్త భయమూ, బిడియమూను! తీరా నాకు పరిచయమున్న అమ్మాయితో మాట్లాడుతున్నా కంఠంలో అపస్వరాలు పలుకుతాయి. పదిమంది అమ్మాయిలు ఒక చోట ఉంటే నేనా దారివెంట పోతానంటే, అప్పుడు చూడాలి, భరతనాట్యం చేస్తున్న వాళ్ళల్లో పడే నా అడుగులను!

గంగమ్మగుడి దగ్గర నించునివుంటే రంగుల రాట్నం దగ్గర మూగిన పిల్లలు అరిచే అరుపులు, భిక్షగాళ్ళు వేసే కేకలు, బొమ్మరిల్లులోనుంచి వెలువడుతున్న నవ్వులు కలగాపులగంగా విన వస్తున్నాయి మాకు.

గుడిముందు నించొని, గుడి సామీప్యానికి, దేవత సాన్నిధ్యానికి వచ్చే గరిగలు, అరటి ఆకు వేషాలతో గరిగలను నెత్తినపెట్టుకొని, హంసను అనుకరించే రాకే నడకలతో వస్తున్న పురుష పుంగవులను; వాళ్ళను వెన్నంటివచ్చే అందాల జాబిల్లులను; జాజులతో, మల్లెలతో, మొగిలిరేకులతో ముంచెత్తిన గరిగ కుండలను చూస్తున్నాము.

అంతలో మేము నించున్న స్థలానికి అతి చేరువలో మాముందు ముగ్గురమ్మాయిలు వచ్చి నించున్నారు. అందులో మధ్యన ఉంది పద్మలత.

ఆ అమ్మాయిని చూసి, "ఒరే, వా! చుక్కల్లో చంద్రికలా, కాదు—రాళ్ళలో రత్నంలా ఉందిరా ఆ అమ్మాయి!" అన్నాడు హర్నాథ్ గట్టిగా.

"నీ పిండాకూడు! ఏడ్చినట్టు వుంది నీ వర్ణన. మహిళల్లో మహారాణిలా, అప్సరల్లో రంభలా ఉందను" అంటూ వంత పాడాడు కృష్ణ.

వాళ్ళ మాటలు విని, చివాలున వెనుదిరిగి అవమానించినట్టు వాడిగా, వేడిగా అసహ్యిస్తున్నట్టు ఓ చూపు సారించింది పద్మలత. ఆ చూపులకు హర్నాథ్, కృష్ణ పళ్ళికిలించి, పరిహాసంగా నవ్వారు కాని, నేనుమాత్రం కాస్త జడుసుకున్నాను.

"వయసు కుర్రాడికి ఎంతో అంత భయం, వల్మనాతిన మంచితనం ఉంటే అందుకు తగ్గట్టు చిలిపితనం లోపిస్తే ఏ పిల్లా మెచ్చదు నిన్ను. ఏ పిల్లకూ నచ్చవు నువ్వు!" అన్నాడు చంద్రశేఖరం హితోపదేశం చేస్తున్నట్టు.

నేను కిక్కురుమనలేదు.

అంతలో, "అదిగోనే— పద్మలతా! మనవూరి గరిగలు" అంటూ పద్మలతను ఉద్దేశించి అటు వైపు చేయి చూపుతూ అంది, పద్మలత పక్కన ఉన్న ఓ శ్యామలాకారిణి. వాళ్ళతోపాటు మా చూపులనూ అటువైపు సారించాము.

కళ్ళుతిప్పే ఆటలు, కదిరి పున్నమి పలకలు ముందు వస్తూవుంటే ముచ్చటగా బోడించిన గరిగెలు వస్తూవున్నాయి. జనమంతా ఎక్కిన తాక్కినక్కతో అటు చూస్తున్నారు. మేమూ ఎంతో శ్రద్ధగా చూస్తున్నాము.

ఆ సమయాన ఘటోత్కచునిలాంటి ఓ మనిషి బకాసురుడు సంగటి ముద్దలను సేవించిన రీతిలో ముక్కులు మునగా కల్లును సేవించి, కైపెక్కగా, వెనకనుంచి తూలుతూ వచ్చి నా మీద పడ్డాడు. నేను బంతిలా తూలుతూ వెళ్ళి మాముందున్న పద్మలతకు ఢీకొన్నాను. ఆమె వెళ్ళి గరిగమోసే ఒక పసివానిమీద పడింది. అతని తలమీద ఉన్న గరిగ క్రింద పడబోతే పక్కనున్న ఓ పెద్దమనిషి పట్టుకొని, పద్మలతపై కన్నెర్రచేశాడు. ఇక అప్పుడు వచ్చింది పద్మలతకు నామీద కోపం! నేనే గనుక కొత్తర అయివుంటే అప్పుడామె చూసిన చూపుకి తాళలేక మాడి భస్మమైపోయేవాడిని. కాని అసలు ఏం అయి పోయింది. నేను కొత్తర కాకపోతిని.

చూపుల్లో కోపానలాన్ని చిమ్మరిస్తూ, "ఛీ, జ్ఞానంలేని వెధవలు!" అంది పద్మలత ఎంతో కోపంగా.

ఆ మాట విని అగ్గిరాముడయ్యాడు హర్నాథ్. ఏదో అనబోతే నేనే వారించి, శక్తి ఉపయోగించి బోయాను హర్నాథ్‌ను. అతను నామాట వినలేదు. ఏదో కలుగజేసుకోబోతాంటే ఆ అమ్మాయిలే అక్కడనుంచి నిష్క్రమించారు.

"నీ కిలాంటి సువర్ణావకాశాన్ని కలిగించినందుకు గంగమ్మకు నేను టెంకాయకొని కొట్టాలి. టెంకాయలు అంగళ్ళలోవే కదండి" అన్నాడు హర్నాథ్.

నే నామెతో ఢీకొనటం ఒక సువర్ణావకాశంగా భావిస్తున్నాడా మహానుభావుడు, నేనెంతో అవమానం పాలైనట్టు భావించి బాధపడుతూంటే.

"నేను రాను, పో!" అన్నాను కోపంగా.

హర్నాథ్, కృష్ణ లాక్కెళ్ళారు బలవంతంగా.

టెంకాయల అంగళ్ళ దగ్గరా చాలా రద్దీగా ఉంది. నలుగురు పిలుచు దొరకున్నాం ఓ టెంకాయ బేరంకోసం.

నేను అడుగుపెట్టి ముందుకు వెళ్ళానో, లేదో, "అబ్బా!" అంటూ ఓ ఆడ ఆర్తనాదం నా చెవిని పడింది. అందుకు కారణం నేను. నా పాదం ఇంకో పాదాన్ని తొక్కేసింది. తలెత్తి భయంగా, బాధగా చూశాను. ఇంకేముంది? ఎదుట పద్మలత. ఆ ముఖంలోని కోపాన్ని, ఆ కళ్ళలోని రావాన్ని దేనితో ఉపమించను?

"సారీ!" అన్నాను ఎంతో బాధగా.

"ఛీ!" అంది ఎంతో కోపంగా. కావాలనే వాళ్ళను మేము వెంబడించి వేధిస్తున్నామని ఆమె తలచిందేకాని, మేము ఒకరి కొకరు తారసపడటం అనుకోనివిధంగా జరుగుతూందనే విషయం ఆమెకు అర్థంకాలేదు.

'ఎవరి మొహం చూశానో భగవంతుడా, ఈరోజు ఉదయం లేచి' అనుకుంటూ గంగమ్మ దర్శనానికి వెళ్ళాను. ఆ సమయానికి ఆ గుడిలో నాకు కనబడింది గంగమ్మ కాదు. అవతారానికి అప్సరసలా ఉన్నా, తీక్ష్ణ వీక్షణాలకు కాళికను

## నైనారి చిన్నప్ప



అనన్య సామాన్య ప్రచారంగల తెలుగు వారపత్రిక
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక




# పద్మలత

మరిపించే పద్మలత దర్శనమిచ్చింది.

'సంగమ్మజాతర ఇక చాలురా, స్వామీ' అనుకొని, స్నేహితులు వారిస్తున్నా వినిపించుకోకుండా, ఊరిమొహం పట్టాను. ఇదీ పూర్వాశ్రమంలో, పదిహేనురోజుల క్రితం మొట్టమొదటిసారిగా ఆమెను నేను ఎరిగివున్న విధం.

ఇంత తతంగమూ జరిగి సరిగా పదిహేను రోజులే కావటము, అంతలో నాకు బదిలీ వాళ్ళ ఊరికే రావటము, నేను బయలుదేరిన వేళా విశేషమో ఏమో — ఆ ఊళ్ళో అడుగుపెట్టగానే పద్మలతే నీళ్ళు తెస్తూ నాకు దర్శన మివ్వటము — జరిగే సంఘటనల క్రమం చూస్తుంటే చాలా తమాషాగా లేదూ!?

మంచినీళ్ళ బిందెను చంకలో ఉంచుకొని, కుడిచేతిని అలవోకగా ఊపుతూ, వయ్యారపు నడకతో పద్మలత నాకు దగ్గరగా వచ్చాక, "ఈ ఊళ్ళో బడి ఎక్కడో కాస్త చెబుతారా?" అన్నాను.

తల వంచుకొని వస్తున్నదల్లా నా ప్రశ్న విని, పద్మలత చివాలున తల పైకెత్తి, నా ముఖంలోకి అదోలా చుర చురమంటూ ఓ చూపు చూసింది. ఆమె మొహంలో ఆశ్చర్యం తాండవించింది నన్ను గుర్తించగానే. ఆ కళ్ళలో కోపానలం చుట్ట తిరిగింది. నిర్లక్ష్యంతో నాకేసి ఒక్కసారి పరిహాసంగా చూసి, మౌనంగా ముందుకు వెళ్ళింది పద్మలత.

ఆదిలోనే హంసపాదు. ఊర్లో అడుగు పెట్టీ పెట్టకముందే సుస్వాగతం. ఇలువంటి చోట, నా ఉద్యోగవిధిని సక్రమంగా నేనెలా నిర్వర్తిస్తానో, ఏమో అన్న దిగులుతో కొంత సేపు అలాగే ఉండిపోయాను.

పద్మలత వెళ్ళిపోయిన మరుక్షణాన్నే ఆదారి వెంబడి ఏడేళ్ళ కుర్రాడు ఒకడు వచ్చాడు.

"బాబూ! ఇక్కడ బడి ఎక్కడో చూపుతావా?" అన్నాను.

"ఓ" అన్నట్టు తల ఊపి, ఆ అబ్బాయి మార్గదర్శిలా ముందు నడిచాడు. నేను అతన్ని అనుసరించాను.

జను అంకణాల అందమైన ఓ రాతిమిద్దెలోకి దారితీశాడా అబ్బాయి. నేను లోపల అడుగెట్టేసరికి గోలచేస్తున్న పిల్లలు—బిక్కు బిక్కుమంటూ నాకేసి చూసి, [illegible] మంత్రం పఠించారు.

నన్ను నేను పరిచయం చేసుకున్నాక, "ఇక్కడ పంచాయతీ ప్రెసిడెంట్‌గారి ఇల్లెక్కడో ఎవరైనా చూపగలరా?" అన్నాను పిల్లల నుద్దేశించి.

అంతకుమునుపు అక్కడ పనిచేసి బదిలీ అయిపోయిన ఉపాధ్యాయుడు తన ఛార్జి ప్రెసిడెంట్‌పరం చేసిపోయినట్టు, ప్రెసిడెంట్ దగ్గరి నుంచి ఆ ఛార్జిని నాపరం చేసుకోమని అధికారు

ఆర్డర్. అందుకని వచ్చీరాగానే పంచాయితీ ప్రెసిడెంట్‌గారి ఇల్లును గురించి వాకబు చేయ వలసిన అవసరం ఏర్పడింది.

"నేను చూపుతాను" అంటూ ఓ ఎర్రటి అబ్బాయి లేచి నించున్నాడు.

"నీపేరు?" అడిగాను.

"చంద్రప్రసాద్."

"ఏ తరగతి చదువుతున్నావ్?"

"ఐదవ తరగతి."

"సరే, చూపెడుదువు పద!"

అతను ముందు, నే నతని వెనుక బయలు దేరాము. అతను అందమైన ఓ భవంతిలోకి దారితీశాడు. అతనివెంట నేనూ హాల్లో అడు గెట్టాను.

బస్తీలోని ఓ ఆఫీసరుగారి ఇల్లుకుమల్లే ఎంతో అందంగా అమర్చిపెట్టినట్టుంది భవంతి. హాల్లో ఒక టేబిల్, నాలుగైదు కుర్చీలు ఉన్నాయి. టేబిల్‌పై రేడియో సెట్ ఉంది. దానిపక్కనే ఫ్లవర్‌వేజ్ ఉంది. గోడలకు దేశ నాయకుల ఫోటోలు వేలాడుతున్నాయి. అని గాక ఫ్రేమ్ కట్టించిన ఎన్నో అందమైన దృశ్యాలు, టాగూర్‌గారున్న కాలెండర్ ఒకటి, ఒక బెల్జియం అద్దం ఉన్నాయి. ప్రతి ద్వారానికి క్కటి లేస్ అల్లిన కర్టెను కట్టబడి ఉంది.

ఓ మారుమూలన ఉన్న పల్లెలోని అందమైన ఆ భవంతిని చూస్తుంటే పరిశుభ్రతలోను, నాగరికతలోను కొంతకాలం లోపుననే పల్లెలు పట్నాలతో పోటీపడతాయా అనిపించింది. నేను హాల్లో ఉండగా నావెంట వచ్చిన అబ్బాయి లోపలికి వెళ్ళాడు.

కుర్చీపై కూర్చుందామనుకుంటూనే నించుని ఆ యింటి నాజాకును చూస్తున్నాను. లోపలకు వెళ్ళిన ఆ అబ్బాయి నవ్వుతూ మరుక్షణాన్నే హాల్లోకి వచ్చి, "వస్తారట, కూర్చోమన్నారు" అనేసి వెళ్లిపోయాడు.

కుర్చీలో కూర్చుని, టేబిల్‌పై ఉన్న ఓ వారపత్రికను చేతిలోకి తీసికొని పేజీలు తిప్ప సాగాను. ఐదు....పది...ఇరవై నిమిషాలు గడి చాయి. విసుగెత్తింది. కానీ లోపలనుంచి ఎవరు కాని బయటికి వచ్చి పలకరించిన పాపాన పోలేదు. అసలు లోపల ఎవరైనా ఉన్నారా, లేదా అని సందేహం వేసింది—ఉలుకూ పలుకూ కాని, కాస్త సవ్వడికాని వినిపించకపోతే.

ఒకసారి సొడిగా దగ్గాను నా ఉనికిని గుర్తు చేస్తూ. లాభం శూన్యం. మరో పదినిమిషాలు కూడా గడిచాయి. చేతిలోని వార పత్రికను టేబిల్‌పై పడవేసి, కళ్ళుమూసికొని, కుడిచేతి చూపుడువ్రేలితో నొసలు రాసుకుంటూ—ధ్యానమగ్న మానసుడైన యోగీశ్వరునిలా కూర్చున్నాను. మరో ఐదు నిమిషాలు కూడా గడిచిపోయి ఉండవచ్చు.

ఉన్నట్టుండి అతిచేరువలో అడుగుల సవ్వడి అయింది. గాజులు కదిలిన శబ్దం అందెల రవళిలా వినిపించింది. నా ధ్యానం చెడిపోయింది. మనసు చెదిరిపోయింది. అరమోడ్పుగా కన్నులు విప్పాను. కలలో లీలగా కనిపించే ఏ దివ్యసుందరిలాగానో, ఎవరో దేవసుందరి నా ఎదుట ఉన్నట్టు అను భూతి కలిగింది. కళ్ళు పూర్తిగా విప్పాను. నా ఎదుట పద్మలత నించుని ఉంది! ఆమెను చూడ గానే నాలో ఏదో కంగారు కదిలింది. 'తపీ'మని కుర్చీలోనుంచి పైకి లేచాను, కళవళపడిపోతూ.

'నా కంగారును చూచి, ఆమె తనలో పెల్లుబికి పైకి రావటానికి ప్రయత్నించే చిరు నవ్వును బలవంతాన ఆపుకుంటూంది'అని అన డానికి చిరుగాలికి కదిలే చిగురుటాకులా మెల్లగా చలించే ఆమె ఎర్రటి పెదవులే నిదర్శనం. నా



తేజోవలయం

చిత్రం — కె. శేషగిరిరావు (విజయనగరం-1)

కంగారుకు నాకే చచ్చేంత సిగ్గేసింది.

"ఎవరు మీరు? ఏం కావాలి మీకు?"

పాతికేళ్ల యువకుడను. నాకంటే చిన్న దైన ఆ అమ్మాయిముందు పదేళ్ల కుర్రాడిలా అయిపోయాను జవాబివ్వడానికి.

"నేను కొత్త మాస్టార్ని! ఛార్జీ పుచ్చుకోవ డానికి ప్రెసిడెంట్‌గారికోసం వచ్చాను."

నా జవాబు విని, నా ఆపాదమస్తకంకేసి ఓ చూపు సారించి, "మంచిది, కూర్చోండి!" అంది పద్మలత.

ఆమె రాగానే లేచి నించోవటము, కూర్చో మనగానే కూర్చోవటమేనా నాపని? ఆమె మాటను పెడచెవినిపెట్టి, నా ఆధిక్యాన్ని నిరూ పించుకోవద్దూ?

"టైం అవుతోంది, వెళ్ళాలి! ప్రెసిడెంట్ గారున్నారా?" నిలబడే ప్రశ్నించాను.

"ఉన్నారు!"

"ఐతే దయచేసి వార్ని కాస్త పిలవండి!" నా గొంతులో వేడ్కోలు ఉన్నట్టు నాకే అను మానం.

"వార్ని కాస్త పిలవాల్సిన పనిలేదు. కాస్త పిలిస్తే వారసలు రారు" అంది, కాస్త అనే, నా మాటను ఒత్తిపలుకుతూ, ఎత్తిపొడుస్తూ పద్మ లత. నేను అన్న కాస్త నా ముఖాన్ని కాస్తగా చే! పారేసింది.

"ఏం? ఎందుకు రారు?" అన్నాను తలెత్తి ఆమె ముఖంలోకి ధైర్యంగా చూస్తూ.

"నేనే ఆ ప్రెసిడెంట్‌ను గనుక" అంది పద్మలత తన ఆధిక్యాన్ని ప్రదర్శిస్తూ.

'చచ్చాన్రా భగవంతుడా!' అనుకున్నాను ఆమాట విని. క్షణంపాటు నిశ్చేష్టితంగా పద్మలత ముఖంలోకి చూస్తుండిపోయాను. నా మతిమరుపు మండి, మాడి, మసైపోనూ—మా అధికారి ఒకనాడు మాటల సందర్భాన చెప్పారు, అది ఆడవాళ్ళపంచాయతీ గ్రామమని. పద్మలత 'నేనే ప్రెసిడెంట్‌ను' అనేదాకా ఆ విషయమే స్మృతిలో లేదు నాకు.

జాగ్రత్తగా ఛార్జీ హస్తగతం చేసుకున్నాను.

జయులుదేరి వచ్చేశాను. పద్మలత పాత సంఘటనను మనసులో ఉంచుకొని, నన్నేక్కడ ఆట ఆడిస్తుందేమో అనుకున్నాను దారిలో వస్తూ.

పాతశాల గ్రామానికి, మా స్వగ్రామానికి మధ్య దూరం ఐదుమైళ్ళే కాబట్టి రోజూ ఉదయం బడి సమయానికి సరిగా రావటము, ఐదుగంటలు తర్వాత బడివదిలి వచ్చినట్టే సైకిల్లో వెళ్ళిపోవటము—ఇలా వారంరోజులు గడిచాయి.

ఒకరోజున యథాలాపంగా నా బోధనలో నేను లీనమై ఉన్నాను. అంతలో ఓ నడికారు వయసులో ఉన్న మొటుమనిషి వచ్చి, "అయ్యగారూ!" అన్నాడు.

'ఏమిటి సంగతి?' అన్న మాస్తర్లో అతని

# పద్మలత

క్షేసి చూశాను.

"అమ్మగారు రమ్మంటున్నారండి!" అన్నాడా వచ్చిన మనిషి.

ఈ అయ్యగారిని పిలిచే అమ్మగారెవరో? ఎందుకో? నాలో నాకే నవ్వు ఆగలేదు. నవ్వుతూనే అడిగాను: "ఏ అమ్మగారు?"

"ఇంకే అమ్మగారు? పద్మమ్మగారే!" అన్నాడా వ్యక్తి, నేనేదో అడగరాని విషయం అడిగేసినట్టు చోద్యపడిపోతూ.

నేను వెళ్ళేసరికి పద్మలత పంచాయతీ ఆఫీసులో ఉంది. ఆమెతోపాటు మరో నలుగురమ్మాయిలు—పంచాయతీ సభ్యులు కాబోలు—కుర్చీల్లో ఆసీనులై ఉన్నారు. నేను లోపలకు వెళ్ళగానే, "కూర్చోండి!" అంటూ కుర్చీ చూపించింది పద్మలత. కుర్చీలో కూర్చున్నాను.

"పాతశాల ఉన్న గ్రామంలోనే మాస్టారు కాపురం ఉండాలనే చట్టం ఒకటి ఉన్నదన్న విషయం మీకు తెలియనిదికాదు. కానీ మీరు వచ్చి వారంరోజులైనా ఆమాటే తలపకుండా రోజూ మీరు సైకిల్లో వచ్చిపోతూంటే ఎలా?" అంది పద్మలత.

ఏమి చెప్పటానికి పాలుపోలేదు నాకు. పాతశాల గ్రామంలోనే ఉపాధ్యాయుడు కాపురం ఉండాలన్న చట్టమైతే ఒకటి ఉంది కాని, ఆ గ్రామంలో మాస్టారు ఉండటానికి కనీసం ఓ పూరిపాకైనా అవసరమని, ఆ పూరిపాకన్నా నాసరే ఆ గ్రామస్థులే సమకూర్చి ఇవ్వాలనే మరో చట్టం ఎందుకు చేయలేదో పై అధికారులు?

పట్టణంలో ఐతే రూపాయిదమ్మిడీలు మరో రూపాయి ఎక్కువ అద్దె ఇస్తామంటే ఓ చక్కటిమేడ కావాలన్నా దొరుకుతుంది. కాని, నేడు గ్రామసీమల్లో ఏమిస్తామన్నాసరే, ఓ పూరిపాక కూడా చిక్కటంలేదు. ఆ ఇబ్బందే సమయానికి స్ఫురణకు వచ్చింది. ఆమాటే చెప్పాను పద్మలతతో.

"మీరు గనుక నేను ఉండటానికి ఓ గది చూపెట్టారంటే ఈ వూర్లోనే కాపురం ఉండటానికి నాకేలాంటి అభ్యంతరమూ లేదు. రోజూ ఐదుమైళ్ళు రావటం, పోవటం నాకూ బాధగానే ఉంది."

నామాట విని, తక్కిన నలుగురమ్మాయిలతోనూ సంప్రదించింది పద్మలత—నాకోసం ఎవరైనా తమ ఇళ్ళలో ఓగది ప్రత్యేకిస్తారేమోనని! ఆ నలుగురమ్మాయిలలో ఎవరూ సుముఖత చూపలేదు పద్మలత సూచనకు. తుదకు పద్మలత అంది: "మా ఇంట్లోనే మీకోసం ఒక గది ప్రత్యేకిస్తాను. మీ రందులో ఉండవచ్చు."

"అలాగే"నని తల ఊపి, బడికి వచ్చేశాను.

ఆ మరునాడే పద్మలత వాళ్ళింట్లో నాకోసం గది ఏర్పాటయింది. ఒక కుర్చీ, ఒక టేబిల్ నాకోసం ఆ గదిలో వేయించింది పద్మలత. ఒక బెల్జియం అద్దాన్ని కూడా అమర్చిపెట్టింది. ఆమెకు ఒక చిన్న లైబ్రరీ ఉంది. కావలసిన పుస్తకం అందులో తీసికొని చదువుకోవచ్చు. సాయంసమయాల్లో ఇష్టమైతే రేడియో పెట్టుకోవచ్చు. నిజం చెప్పాలంటే మా యింట్లోకంటే రెండురెట్లు వసతిని ఏర్పాటు చేసింది పద్మలత నాకు.

పద్మలతకు నాన్న, ఒక తమ్ముడు—చంద్రప్రసాద్— ఉన్నారు. ఆ యింట్లో చేరేదాకా చంద్రప్రసాద్ పద్మలత తమ్ముడని నాకు తెలియదు.

పద్మలత తండ్రి, రాఘవయ్యగారు చాలా కలుపుగోలు మనిషి. నన్ను గురించిన వివరాలన్నీ




జమ్మి వారి లివర్‌క్యూర్

పిల్లల లివర్, స్ప్లీన్ వ్యాధులకు

దిగువచోట్ల క్రమం తప్పకుండ నెలసరి సంప్రతింపులు

| స్థలము | తేదీ | వేళలు | అడ్రసు |
|---|---|---|---|
| నెల్లూరు | 6 | ఉ. 9 నుండి 12 | అజంతా హోటల్, ట్రంక్ రోడ్డు. |
| తెనాలి | 12 | డిటో | కన్యకాపరమేశ్వరి సత్రం. |
| చీరాల | 13 | డిటో | రాజమహల్ లాడ్జి, రైల్వేస్టేషన్ దగ్గర. |
| గుంటూరు | 14 | డిటో | మెస్సర్స్. ది మెడికల్ స్టోర్సు, కొత్తపేట. |
| విజయవాడ | 15 | ఉ. 9 నుండి 12<br>సా. 3 నుండి 5 | మోడరన్ కేఫ్, లాడ్జింగ్ సెక్షన్, గాంధీనగర్. |
| రాజమండ్రి | 16 | ఉ. 9 నుండి 12<br>సా. 3 నుండి 5 | మెస్సర్స్. ఈశ్వర్‌దాస్ అండ్ కంపెనీ, ఇన్నీస్‌పేట. |
| మదనపల్లి | 28 | ఉ. 9 నుండి 12 | బృందావన్‌లాడ్జి, బోర్డింగ్ అండ్ లాడ్జింగ్. |
| కదిరి | 29 | డిటో | మెస్సర్స్. గొండ్రాల బ్రదర్స్, కెమిస్ట్సు అండ్ డ్రగ్గిస్ట్సు, పోస్టాఫీస్ రోడ్డు. |
| చిత్తూరు | 30 | ఉ. 9 నుండి 11 | ఓరియంటల్ లాడ్జి, హైరోడ్. |
| తిరుపతి | 30 | సా. 3 నుండి 5 | డాక్టర్ ఆర్. గోపీనాథ్, 28, గంగుండ్ర మండపం వీధి. |
| ఖరగ్‌పూర్ | 4 | ఉ 9 నుండి 11<br>సా 3 నుండి 5 | మెస్సర్స్ యునైటెడ్ మెడికల్ స్టోర్సు, ఎస్ ఓ ఇ. 155, రైల్వే మార్కెట్. |
| జంషెడ్‌పూర్ | 15 | ఉ. 9 నుండి 11<br>సా. 4 నుండి 5 | మెస్సర్స్. సిటీ కెమిస్ట్సు, సాక్చీ. |

జమ్మి వెంకట రమణయ్య అండ్ సన్స్,

"మహేంద్ర నివాస్"

లేబర్ వెల్‌ఫేర్ సెంటర్ దగ్గర.

వివేక్‌నగర్, ముషీరాబాద్ పో. ఆ., చిక్కడపల్లి, హైదరాబాద్—20 (ఆం. ప్ర.)

బ్రాంచి: ఉరుగంటివారి వీధి, విజయనగరం.

నానుంచి ప్రశ్నించి తెలుసుకున్నాక, "అబ్బాయ్! మీనాన్న నాకు బాగా తెలుసోయ్! ఇద్దరమూ ఒకప్పుడు మిత్రులమే. పైగా దూరపు బంధుత్వం కూడాను" అన్నాడు నవ్వుతూ.

బడిసని చూచుకోవటము, సాయంత్రాన గదిలో కూర్చుని ఏదైనా లైబ్రరీ పుస్తకం చదువుకోవటము, లేదా రేడియో వినటం, అదీ కాకపోతే అలా పొలాలకేసి షికారు వెళ్ళి రావటం, రాత్రుల్లో ఎనిమిదిదాకా చంద్రప్రసాద్‌కు ప్రైవేటు చెప్పటం—ఇవీ నా నిత్య దినకృత్యాలు.

ఒకరోజు రాత్రి పాత నాపేలంపై ఏదో లెక్క చెబుతున్నాను. అంతలో "మాస్టారూ!" అంటూ ప్రశ్నార్థకమైన మొహంతో నాకేసి చూశాడు చంద్రప్రసాద్. 'ఏమి'టన్నట్లు అతని కళ్ళలోకి చూశాను.

"ఒకటిన్నర అణాలకు ఒకటిన్నర టెంకాయ లైతే రూపాయికి ఎన్నికాయలు, మాస్టారూ?" అన్నాడు నా శిష్యాగ్రేసరుడు.

నిమిషం తర్వాత, "పదునారు" అన్నాను. విజయాన్ని సాధించిన వీరకేసరిలా ఇంట్లోకి దౌడుతీసి, రెండుక్షణాల అంతరం తిరిగివచ్చాడు చంద్రప్రసాద్. అతనివాలకం చూస్తుంటే నాకు నవ్వువచ్చింది. అంత లెక్క అతని బుర్రకు తోచి ఉండదని, ఎవరో చెప్పి పంపినది కాబోలని, "ఏమిటి విషయం, చంద్రా?" అన్నాను.

"మరే...ఆ లెక్క మా అక్క నన్నడిగింది, మాస్టారూ! నాచేతకాదు; మా మాస్టార్ని అడిగి చెబుతానంటే—నీ కొచ్చినట్టే మీ మాస్టారుకీ వ....స్తే...."

"చంద్రా!" పద్మలత గది వాకిట్లో నించుని, చెబుతున్న తమ్ముడి మాటను అర్థోక్తిలో ఆపేసింది.

"మిమ్మల్ని గురించి వాడేదో వాగుతూ—మా మాస్టారు అంతటివాడు, ఇంతటివాడని భట్రాజులా పొగుడుతూ ఉంటే ఏదో తమాషాకు అలా అడిగానంతే! మిమ్మల్ని పరీక్షించాలని, కించపరచాలని నా ఉద్దేశంకాదు. అసలు మిమ్మల్ని నేను పరీక్షించనూలేను, కించపరచనూలేను. ఏమను కోకండేం!" భోజనంపెట్టి, తలుపు నానుకొని నించుని, భోజనం తింటున్న నాతో పద్మలత అమాట అంటూంటే ఎన్నడూలేని ఏదో ప్రసన్నత ఆమె ముఖంలో గోచరించింది నాకు. ఆనాటి నుంచి పద్మలతకు నాయెడ గౌరవాభిమానాలూ, నాకు ఆమెయెడ ఆసక్తి చనువూ ఎక్కువయ్యాయి.

రెండునెలలు రెండు వారాల్లా దొర్లి పోయాయి. ఇప్పుడు పద్మలత ప్రోద్దస్తమానమూ సాధ్యమైనంత ఎక్కువగా నా కళ్ళకు కనిపించటానికి ప్రయత్నిస్తోంది. ఎప్పుడూ ఆమెను చూస్తూ ఉండటానికి నా మనసు తహతహలాడుతోంది. సాయంసమయాల్లో షికారు వెళ్ళటం పూర్తిగా మానేశాను. బడి ఎప్పుడు ముగియునా, ఎప్పుడు ఆఘమేఘాలపై వెళ్ళి యింట్లోవారి పద్మలతను చూడనా అంటుంది మనసు. అలాగని నే నెన్నడూ నా విధ్యుక్త ధర్మాన్ని, వృత్తిధర్మాన్ని విస్మరించలేదు. కాని, ఊళ్ళో మాత్రం నాపై కాదు, మాపై ఏవో గుసగుసలు ప్రారంభమయ్యాయి. ఆ విషయం కూడా ఒకరోజున పద్మలత చెబితేనే నాకు తెలిసింది.

"మనలను గురించి ఎవరెవరో ఏమేమో అనుకుంటున్నారు" అంది అదోలా.

"ఎవరెవరు ఏమేమి అనుకుంటున్నారేమిటి?" అన్నాను.

"ఏమీ ఎరగని పసిపాపలా అలా అడుగుతారేం?" అంది ఓరగంటితో అదోలా చూస్తూ.

"అంటే?"

"అంటే ఏమిటో నాకు తెలియదు" అంది చిరుకోపంతో సిగ్గు పడుతూ.

ఒక్కసారి అదోలా అయిపోయాను ఆమాట వినగానే.

"ఏం, భయంగా ఉందా?" నిర్భయంగా అడిగింది.

"నాకెందుకు భయం? ఇంతకూ ఆడపిల్లకు లేనిలేని దిగులు నాకెందుకు?"

"కొండనుచూచి ఊరకుక్కలు నూరు మొరుగుతాయి. కొండ అంతమాత్రాన తరిగి పోతుందా? లేక ఎద్దని కుక్కలతో అంటే వింటాయా? అంతమాత్రానికి ఎవరుకాని, ఎందుకు దిగులుపడాలి?" ఆమె మాటలతో నాలో ఏదో ఉత్సాహం ఉరకలు వేసింది. ఆరాధించే కళ్ళతో, అనురాగంపొంగే చూపులతో ఆమెకేసి చూశాను క్షణంపాటు. నా చూపులకు పద్మలత సిగ్గుపడింది. చిరునవ్వు నవ్వింది. నాముందు నిలువలేక లోపలకు వెళ్ళిపోయింది.

ఆమరునాడు పదిగంటల ప్రాంతాన బడిలో ఆంధ్రప్రదేశ్‌ను గురించి పాఠం చెబుతున్నాను. సమితివారు సరఫరా చేసిన ఆంధ్రప్రదేశ్ పటము నా గదిలో ఉంది. ఆ పటాన్ని తెచ్చి, పిల్లలకు చూపెట్టి, పాఠంచెబితే పాఠం మరింత రసవత్తరంగా ఉండి సుబోధక మవుతుందనే ఉద్దేశంతో—పటం తేవడానికి నాగదికి వెళ్ళాను.

ముందరకు మూసి ఉన్న తలుపులను మునివ్రేళ్ళతో నెట్టి, మూడడుగులు లోపలకువెళ్ళి, అలాగే నించుండిపోయాను.

అప్పుడే తలస్నానం చేసి, అర్ధనగ్నంగా తన అందాన్ని ఓ చీరతో ఆచ్ఛాదన చేసుకొని, నా గదిలో ఉన్న బెల్జియం అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ, తల దువ్వుకుంటూంది పద్మలత. బారెడు పొడవుతో నిగనిగలాడే ఆమె తడి వెంట్రుకలు పిరుదులదాకా ఒత్తుగా వ్రేలాడుతున్నాయి.

ముందున్న అద్దంలో తన ప్రతిబింబం ప్రక్కన నా ఛాయ కనిపించిందేమో—వెంటనే 'తపే'మని నావైపు తిరిగింది పద్మలత. నిన్నొన్నతాలను దాచే పైట జారితే—సర్దుకొని బాగా కప్పుకుంది. మ్రాన్పడినవాడిలా కళ్ళప్పగించి ఆమె

అనన్య సామాన్య ప్రచారంగల తెలుగు వారపత్రిక
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

చర్మశుభ్రతకు

నిక్సోడెర్మ్ (NIXODERM)ను రాసినచో మొటిమలు మాయమగును. నేటి రాత్రి నిక్సోడెర్మ్ (NIXODERM) వాడి చూచినచో చర్మము మృదువుగాను, నాజూకుగాను శుభ్రపడునని గమనించగలరు. మొటిమలు, కురుపులు, ఎర్రని మచ్చలు, దురద, తామర మొదలగువాటికి కారణభూతమగు క్రిమి జాలమును శాస్త్రోక్తముగా తయారైన నిక్సోడెర్మ్ (NIXODERM) సంహరించును. చర్మపురంధ్రములలో దాగియుండు వేరువేరు క్రిమి జాలమును తొలగించని యెడల మీ చర్మవ్యాధులు నివారించవు. మీ మొటిమలను నిశ్చయముగా పోగొట్టి చర్మమును మృదువుగాను, నాజూకుగాను శుభ్రము చేయు నిక్సోడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టు వద్ద కొనండి.



పోస్టు ద్వారా చిత్రకళ నేర్చుకోండి.

సులభమైనా సమర్థమైన విధంగా దక్షిణ భారతంలోని ప్రముఖ చిత్రకారుడు శంతను చే శిక్షణ. బోధనాభాష ఇంగ్లీషు లేక తమిళం. కోర్సు రెండు సంవత్సరాలు మాత్రమే.

భారతదేశంలో కాని, విదేశాలలో కాని ఎక్కడ ఉన్నా స్త్రీ పురుషులు ఉభయులూ చేరి, నియమిత సమయాలలో పాఠాలు తెప్పించుకొనవచ్చు. ప్రాస్పెక్టస్‌కొరకు 25 న. పై. ల స్టాంపులతో దరఖాస్తు పెట్టండి.

SANTHANU'S ART INSTITUTE,
c/o Chitira Kullan,
P.B. No. 2740,
CHINTADRIPET, MADRAS-2.

స్థాపితం: 1957 ఫోన్: 82796.

అందాన్నిచూస్తూ అలాగే నించుండి పోయాను చేష్టలుడిగి. పద్మలత ముఖంలో రంగులు మారాయి.

"ఛీ! బయటపొండి, ఇక్కడినుంచి!" ఆజ్ఞాపిస్తున్నట్లు ఆవేశంతో అరిచింది పద్మలత. ఆమెకు చాలాకోపం వచ్చింది కాబోలు. పటం తీసుకోకనే బయటికి వచ్చేశాను.

మధ్యాహ్నం పిల్లలను భోజనానికి పంపివేశాను. నేనుమాత్రం ఇంటికి వెళ్లలేదు. వెళ్లి పద్మలతముందు నించునే ధైర్యం నాకులేదు. ఏదో వ్రాసుకుంటూ కూర్చున్నాను.

## పద్మలత

ఒకసారి పాలేరు వెంకన్న, ఇంకొకసారి చంద్రప్రసాద్ వచ్చి భోజనానికి పిలిచారు. ఆకలి లేదని అబద్ధమాడి పంపివేశాను. తుదకు ఒంటిగంట ప్రాంతంలో స్వయంగా తనే వచ్చింది పద్మలత.

"వెలగబెట్టిన నిర్వాకం చాలు. భోజనంచేసి వచ్చిన తర్వాత ఆ వ్రాసుకుండేదేదో వ్రాసుకుందురుగాని లేవండి" అంది. నాపైన ఆమెకు ఉన్న కోపం తరగక పెరిగినట్లు ఆ పలికమే చెప్పక చెబుతూంది. మారుమాటాడకుండా పైకి లేచి, బయటికి వచ్చాను.

పద్మలత ముందూ, ఆమె వెనుకనే నేనూ వీధిలోకి వచ్చాం. పొలందగ్గరినుంచి వస్తూ నాయుడు తారసపడ్డాడు. మా ఇద్దరికేసి అదోలా అనుమానంగా చూచి, పరిహాసం చేస్తున్న మోస్తర్లో ముసిగా నవ్వాడు.

నాయుడు నడివయసుతో నాజూకుగా ఉంటాడు. డాబుసరిగా వేషం వేస్తాడు. దర్పంగా నడుస్తాడు. ఆ కళ్లు కుటిలత్వానికి స్థానాలో, దయకు నిలయాలో అతణ్ణి పూర్తిగా ఎరిగి ఉన్నవారికి మినహా అర్థంకాదు.

నాయుడికి, పద్మలత తండ్రి రాఘవయ్యకు చిన్నప్పటినుంచే బద్ధవైరం. చిన్నతనంపోయి ముసలితనంమీదపడినా వాళ్ల వైరంపోలేదు. గత పంచాయతీ ఎన్నికలలో ఇద్దరికీ ముష్టాముష్టి జరిగే సమయానికి—ఎవరో మధ్యనచేరి, పందెపు రంగంనుంచి ఇద్దరినీ నిష్క్రమింపజేసి—వాళ్లకు బదులు వాళ్ల కూతుళ్లను ఎన్నికలలో పోటీచేసేటట్లు నిర్ణయించారట. ఆ మాటకు ఇద్దరూ కట్టుబడ్డారు. ఫలితంగా నాయుడు కూతురు రమాసుందరి వైస్‌ప్రెసిడెంట్‌గాను, రాఘవయ్య కూతురు పద్మలత ప్రెసిడెంట్‌గాను నెగ్గారు. ఇక సరిగ్గా నెలరోజులే ఉన్న పంచాయతీ ఎన్నికలలో ఎలాగైనా తన కుమార్తెను ప్రెసిడెంట్‌గా చేయాలని నాయుడి సంకల్పం.

అన్నం వడ్డించి ముభావంగా నించుంది పద్మలత. కన్నెత్తి నే నామె ముఖంలోకి చూడలేదు. పన్నెత్తి ఆమె నన్ను పలకరించలేదు. నవ్వుతూ, నవ్విస్తూ, కొసరి వడ్డిస్తూ—నాచేత కడుపారా అన్నం తినిపించే పద్మలత—వాడిన పువ్వులా, మౌన దేవతలా నించుంటే కడుపారా నేనెలా అన్నం తింటాను? అర్ధాకలితో పైకి లేచాను.

సాయంత్రం ఐదుగంటలకు బడి వదిలివేశాను. గదికి వెళ్లాలనిపించలేదు. పొలాల వైపు అలా షికారువెళ్లి, ఊరికి దూరంగా ఉన్న ఒక చిన్న గుట్టపై కూర్చున్నాను.

గుట్టపైభాగాన ఉన్న ఏదో దేవాలయం పక్షి గుడ్డులా కనిపిస్తూంది. గుట్టకు క్రింది భాగాన దూరంగా పశువులు, గొర్రెలు మేత మేస్తున్నాయి. పొలాల్లో మనుష్యులు ఉత్సాహంగా పనులు చేసుకుంటున్నారు. కర్మసాక్షి కనుమరుగు కావడానికి కాలాన్ని లెక్కిస్తున్నాడు. పడమర దిక్కునుంచి వీచే సాయంత్రపు చల్లగాలి మెల్లగా వీస్తూ ఎంతో ఆహ్లాదాన్నిస్తూంది.

"నమస్తే, మాస్టారూ!"

"నమస్తే." ప్రతి నమస్కారం చేసి, పక్కకు తిరిగి చూశాను.

తెల్లటి చుక్కల చీర కట్టుకొని, చిలుకపచ్చ రంగు జాకెట్ వేసుకొని, తలంటి పోసుకున్న కురులను వదులుగా జడవేసుకొని, నడిస్తే కంది పోతాయా అన్నట్లుండే పారాణిరాసిన పచ్చటి



పాదాలతో రమాసుందరి, గుట్టుక్కే నా సమీపానికి వచ్చింది.

"కూర్చోండి" అన్నాను. నా ప్రక్కన రెండు పిట్టన్నదూరంలో ఉన్న ఒక తెల్లటి రాతిమీద కూర్చుంది రమాసుందరి.

రెండు నిమిషాలు మౌనానికి వదిలేసి, తక్కిన కాలాన్నంతా తను గుత్తకు తీసికున్నట్టు— విసుగు, విరామం లేకుండా కర్మసాక్షి కనుమరుగయ్యేదాకా ఏదో చెబుతూనే ఉంది రమాసుందరి. నా ధ్యాసంతా పద్మలతమీద ఉన్నందున రమాసుందరి చెప్పిన విషయాలేమిటో ఒక ముక్కా గ్రహించలేదు నేను.

"చీకటి పడుతోంది. ఇక పోదాం" అంటూ పైకి లేచాను. అయిష్టంగానే సమ్మతించింది రమాసుందరి.

మేము వచ్చేసరికి బాగా చీకటిపడింది. మా ఇద్దరి రాకను దూరంనుంచి చూచిన పద్మలత కోపంగా లోపలకు వెళ్ళిపోయింది.

ఎప్పుడూ ఎనిమిది గంటలకు వచ్చే భోజనపు పిలుపు ఆ రోజు తొమ్మిది గంటలకు వచ్చింది. భోజనానికి రమ్మని రోజూ స్వయంగా తనే పిలిచేది పద్మలత. ఇంట్లో ఉండే ఆరోజు తన తమ్ముణ్ణే పిలువనంపింది.

భోజనం చేస్తూ దొంగలాగ బిక్కు బిక్కుమంటూ భయంగా ఒక్కసారి పద్మలత ముఖంలోకి చూశాను. ఆమె మధ్యాహ్నంకంటే ఎంతో బాధగా ఉందనడానికి వాడిన ఆమె వదనారవిందమే సాక్షి. అమాటకొస్తే మధ్యాహ్నం ఆమె బాధపడలేదు. అలిగిన అందాలరాణిలా ఉంది. ఇప్పుడామె శోకదేవతలా ఉంది. ఆమె అలా ఉండడానికి నేనే కారణం కావచ్చు. కాని, ఆమె అలా అర్ధనగ్నంగా ఉన్న సమయాన పొరబాటున ఆమెగదిలోకి పోవడంవలననే ఆమె అలా బాధ పడుతూందా? లేక మరేదైనా కారణముందా? మొదటిదే కారణమైతే మధ్యాహ్నంలేని అలుక— కాదు, బాధ ఇప్పుడెందుకు?

ఆ మరునాటి సాయంత్రం మామూలుగా సుష్టుగా తినేసి షికారు వెళ్ళాను. నేను వెళ్ళిన కాస్సేపటికి నిన్నటిలాగే వచ్చింది రమాసుందరి.

"రోజూ ఇలా షికారుకైనా వస్తారు కాని, ఒక్కరోజైనా మా ఇంటికి రాలేదేం, మాస్టారూ?" అంది ప్రక్కన కూర్చుంటూ.

"మీరు రమ్మని పిలవనిదే నేనెలా రాను?" అన్నాను పరధ్యానంగా.

"మనసులోని మాటను పైకి చెప్పేదాకా గ్రహించలేనంత అమాయకులా మీరు?" అని, క్షణంపాటు మౌనం దాల్చింది రమాసుందరి.

"పోనీ, ఈ రాత్రికి రండి!" అంది అలవోకగా చూస్తూ.

"అబ్బే, ఎందుకులెండి" అంటూ మాట మార్చబోయాను.

"కాదు. ఈ రాత్రికి మీకు తప్పక పిలుపు వస్తుంది."

ఇక అన్నైపు షికారు వెళ్ళకూడదనుకుంటూ పైకి లేచాను. రమాసుందరీ బయలుదేరింది నాతో. ఆమె నాతో మాటాడుతుండటం పద్మలత వాళ్ళ పాలేరు వెంకన్న చూశాడు.

గదిలో ఉండగా ఏడుగంటల ప్రాంతాన నాయుడిగారి పాలేరు, గౌడు వచ్చి, "నాయుడు గారు రమ్మంటున్నారు" అన్నాడు.

రెండు నిమిషాలపాటు ఆలోచించాను, వెళ్ళటమా, మానడమా అని. వెళ్ళకపోతే నాయుడు గారు కోపపడవచ్చు. నేనై విరోధం కొని తెచ్చుకున్నట్టు అవుతుంది. ఒకసారి వెళ్ళివస్తే నాకు రాబోయే నష్టమేమిటి? గౌడువెంట బయలుదేరాను. గౌడు నాకోసం రావడము, వెన్వెంటనే నేను బయలుదేరడము పద్మలత చూస్తూనే ఉంది.

పడక కుర్చీలో పడుకొని, ఏదో దీర్ఘాలోచన చేస్తున్న నాయుడుగారు, నన్ను చూడగనే లేని నవ్వు తెచ్చుకుంటూ సాదరంగా ఆహ్వానించారు. ఆ ఆహ్వానంలో ఏదో మహాధ్యేయం ఇమిడి ఉన్నట్టు తోచింది నాకు. అతను చూపిన కుర్చీలో కూర్చున్నాను.

ఆమాటా, ఈమాటా మాటాడుతున్నాము. అంతలో రమాసుందరి వచ్చింది. నన్ను చూచి అదోలా నవ్వింది. 'నామాట నెగ్గింది చూశారా' అన్న భావం నిబిడీకృతమై ఉందా నవ్వులో.

"భోజనం అయింది, నాన్నా!" అంది నాయుడుగారితో.

"భోజనంచేద్దాం, లే!" అన్నాడు నాయుడు.

"వద్దండి!" అంటూ నేనేదో చెప్పబోతూంటే—నామాటకు మధ్యలో అడ్డుపడి, "ఈ ఒక్కపూటా మా యింట్లో భోజనంచేస్తే ఆ పిల్లేం నిన్ను కొట్టదులే!" అన్నాడు నాయుడు అర్థోక్తిలోనే. అతను పద్మలతను గురించి ఆమాటలనేసరికి నాకెంతో బాధవేసింది. నా ఇష్టాయిష్టాలతో పనిలేదన్నట్టు భల్లూకపు పట్టు పట్టేశాడు నాయుడు. భోజనానికి లేవక తప్పింది కాదు.

వడ్డించటానికి రమాసుందరి తయారయింది. వద్దు మొర్రో అంటున్నా వినిపించుకోకుండా, ఆమె చిరునవ్వులను చిందిస్తూ, సిగ్గులను ఒలకబోస్తూ, చిలిపితనాన్ని చిలకరిస్తూ కొసరి కొసరి వడ్డిస్తూంది.

ఉన్నట్టునుండి నాయుడు, "మాస్టారూ!" అన్నాడు. తలెత్తి నాయుడుగారి మొహంలోకి చూశాను.

"ఒక సాయం చేసి పెడతావా?" అన్నారు నాయుడు తినటం ఆపి.

అంత పెద్ద నాయుడికి నాలాటి చిన్న బడి పంతులు చేయవలసిన సాయం ఏమిటా అని క్షణంపాటు యోచనలో పడ్డాను.

"నాచేత అయ్యే సాయమే గనుక ఐతే తప్పక చేస్తాను" అన్నాను తుదకు.

"కానిదైతే నేనుమాత్రం చెబుతానా? మీ చేత అయ్యే సాయమే. సునాయాసంగా, చిటికలప్పై—మాటమాత్రాన అయ్యే సాయం."



ప్రశాంతత

చిత్రం—ఎస్. దయానంద్ (సికిందరాబాదు)

నాయుడు అదోలా నవ్వాడు.

"సరే, చెప్పండి, ఏమిటో!"

"ఏమీలేదు, రేపుమాసంలో జరగనున్న పంచాయితీ ఎన్నికలలో పద్మలతను పోటీచేయవద్దని చెప్పండి. ఆమె గనక పోటీచేస్తే మా రమాసుందరి ప్రెసిడెంట్ అయ్యే అవకాశం తక్కువ. కాని అవకాశం లేదనుకోవద్దు. కష్టపడాలి కొంత. గోటితో పోయేదానికి గొడ్డలి ఎందుకు చెప్పు? ఈ పరిస్థితుల్లో నువ్వు చెప్పే ఏమాటా కాదనదాపిల్ల. పుల్లవిరిచి క్రిందపడవేసి, దాటవద్దంటే దాటదు. అంతెందుకు? నీమాటే ఆవిడకు సుగ్రీవాజ్ఞంటే నమ్మ" అన్నాడు అదోలా. నాయుడు భరోసా ఇస్తున్నట్టు చెప్పే మాటలు ఏ అర్థంతో, ఎంత నీచభావంతో కూడుకున్నవో గ్రహించేసరికి నా బుర్ర తిరిగిపోయింది. అయోమయంగా, పిచ్చివాడులా నాయుడి ముఖంలోకి చూశాను. నా వాలకాన్ని చూచి నాయుడు ఏమనుకున్నాడో, "ఏం, ఆమాత్రం సాయం చేయలేవా?" అన్నాడు. నిస్సహాయంగా, అశక్తుడులా తల అడ్డంగా ఆడించాను.

గట్టిగా, పరిహాసంగా నవ్వి, గిన్నెలో చేయి కడుక్కున్నాడు నాయుడు. భోజనం ముగించి నేనూ పైకి లేచాను.

"వెళ్ళొస్తాను" అన్నాను దగ్గరగా వెళ్ళి. నా ఆపాదమస్తకం నిర్లక్ష్యంగా ఓ చూపుచూచి, "వెళ్ళిరా!" అన్నాడు నాయుడు. ఆ కంఠంలో నా కర్థంకాని ఏదో భావం ధ్వనించింది. బహుశా ఆ ఊరునుంచి నేను వెళ్ళవలసిన అవసరం త్వరలో ఏర్పడుతుందని, ఆ పని నాయుడే చేయించవచ్చునని నా భావన. రమాసుందరి మొహంలోకి శూన్యంగా చూచి వచ్చేశాను.

నేను వచ్చేసరికి చాలా రాత్రయింది. ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. చంద్రప్రసాద్ నిద్రపోతున్నాడు. పద్మలత ఎక్కడో లోపల ఉన్నట్టుంది. ఆమె తండ్రికి పెందరాళే పడుకోవడం అలవాటు.

గదిలోకి వచ్చి కూర్చున్న వెంటనే వెంకన్న లోపలకు వచ్చాడు.

"ఏంబాబూ, ఇంత ఆలస్యం చేశావ్? ఇంట్లో వాళ్ళంతా భోజనం చేసేదాకా పద్మమ్మగారు భోజనం చేయరని తెలియదూ మీకు? లేవండి, త్వరగా" అన్నాడు.

"ఈపూట నాకు భోజనం అవసరం లేదు, వెంకన్నా! నాయుడుగారింట్లో భోజనంచేసి

# పద్మలత

వచ్చాను" అన్నాను.

"అది కాదయ్యా! మీ...." అంటూ వెంకన్న ఏదో చెప్పబోయాడు. అంతలో పద్మలత సుడి గాలిలా గదిలోకి వచ్చి, "వెంకన్నా, ఇక నువ్వేమీ చెప్పవద్దు. ఇప్పుడు ఆయనగారికి మనము, మన భోజనాలు ఏమాత్రం అవసరం లేదు. కొత్త మనుష్యులు, కొత్త భోజనాలు దొరికాయి" అంది. తలెత్తి ఆమె ముఖంలోకి చూశాను.

ఆమె ముఖం కన్నీటి చారలతో అసహ్యంగా ఉంది. ఆ కళ్లలో ఎంతో కోపం, ఆ కంఠంలో ఏదో బాధ, ఆ హృదయంలో ఏదో ఆవేదన ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఆమె లోనికి వచ్చిన మరుక్షణమే వెళ్లిపోయింది.

ఆమెకు నామీద ఆ కోపం ఎందుకో, కారణమేమిటో తెలుసుకోవాలి. అవసరమైతే క్షమాపణ చెప్పుకోవాలని నిర్ణయించుకున్నాను.

ఒకటి...రెండు...వారం రోజులు గడిచాయి. నా నిర్ణయం కార్యరూపంలోకి రాలేదు. కారణం —ఒక్క భోజనాల సమయంలో మినహా పద్మలత నాకంటికి కనిపించటం బొత్తిగా మానేసింది. అందువలన ఆమె హృదయంలోని బాధ, నా మనసులోని బరువు తగ్గలేదు.

అకస్మాత్తుగా ఒకరోజు అధికారి దర్శనార్థం వచ్చాడు మా బడికి. విజిట్ అయ్యాక, "నీమీద రిపోర్టు వచ్చింది" అన్నారు అధికారి. నేను అనుకున్నంతపనీ నాయుడు చేశాడే అనుకున్నాను. అధికారి ఆ రిపోర్టును చేతికి యిచ్చి, "దీనికి నీ సంజాయిషీ ఏమిటి?" అన్నారు.

రిపోర్టును చేతికి తీసికొని, చదివి ఆశ్చర్యపోయాను. ఆ రిపోర్టు వ్రాసింది, నేను అనుకున్నట్టు—నాయుడు కాదు. పంచాయతీ ప్రెసిడెంట్ పద్మలత వ్రాసింది, ఆ రిపోర్టును నామీద! గ్రామవిషయాల్లో అనవసరజోక్యం కలిగించుకుంటున్నట్టు అందులో ఉంది. ఆ గ్రామ విషయాలేమిటో, అందులో అనవసరమైన నా జోక్యమేమిటో సూచాయిగానైనా లేవందులో.

చదివి, మడిచి, అధికారికి అందించాను రిపోర్టును.

"సంజాయిషీ మాటేమిటి?" అన్నారు అధికారి. సంజాయిషీ సులభంగా ఇవ్వగలను కాని, పద్మలతే నాపైన రిపోర్టు వ్రాశాక, దానికి సంజాయిషీ ఇవ్వటంకాని, ఆ ఊళ్లో ఉండటం కాని ఇష్టంలేదు నాకు.

"నా సంజాయిషీ లేదు కాని, ఒక్కమనవి. దయచేసి, సాధ్యమైనంత త్వరలో ఎక్కడికైనా సరే, బదిలీ ఇవ్వండి నాకు" అన్నాను.

ఆ విషయమే ఒక కాగితంపైన వ్రాయించుకొని వెళ్లారు అధికారి. సరిగా వారంరోజుల నాటికి నాకు బదిలీ ఆర్డర్ వచ్చింది— మా గ్రామానికి దగ్గరగా ఉన్న మరో కుగ్రామానికి.

నేను ఛార్జి అప్పగించి బయలుదేరేవేళ నా విద్యార్థులు—ఆ పసి హృదయాలు వెక్కి వెక్కి ఏడుస్తూ — నాయెడగల ప్రేమాభిమానాలను ప్రకటిస్తుంటే, నా కళ్లలోనుంచి జలజలమని నీళ్లు కారాయి. వచ్చి దాదాపు మూడుమాసాలే ఐనా మాకీ అవినాభావ సంబంధమేమిటో!

నేను బదిలీ అయ్యానని తెలిసిన క్షణం నుంచి పద్మలత ముఖంలో ఏదో ప్రశాంతత నెలకొని ఉంది. ఆమెకు కాస్త విచారమైనా లేదు. పైగా సంతోషిస్తున్నట్టు కూడా ఉంది.

కడసారి సెలవు తీసికొని వెళ్దామనుకుని లోపలకు వెళ్లాను. లోపల పద్మలత ఒక్కతే ఉంది.

"మీ కోరిక ప్రకారమే నాకు బదిలీ అయింది. మీ రిపోర్టు బాగా పనిచేసింది. వెళ్లిపోతున్నాను. సరే, ఇప్పుడైనా చెప్పండి—నామీద ఉన్న మీ కోపానికి కారణమేమిటో?" అన్నాను.

పద్మలత పెదవి కదపలేదు.

"పొరబాటున మీ మనసు నొప్పించి ఉంటే, అనవసరంగా మిమ్మ బాధించి ఉంటే నన్ను క్షమించమని మనసారా ప్రార్థిస్తున్నాను. ఇంత కాలం మీరు నాపట్ల చూపిన ఔదార్యానికి సర్వదా కృతజ్ఞుణ్ణి! వస్తాను" అని బయలుదేరాను. ఆమాటలంటూంటే నా మనసు గద్గదమైంది. నాలుగు అడుగులు నడిచానో,లేదో,"మాస్టారూ!" అంది పద్మలత. వెనుదిరిగి చూశాను నిలబడి. త్వరత్వరగా నా దగ్గరికి వచ్చింది పద్మలత. నాచెంత నిలచుంది. ఆమె కళ్లలో అశ్రుకణాలు పొంగిపొరలుతున్నాయి.

"ఇంటికి వెళ్లాక ఈ ఉత్తరం చదువుకోండి, మాస్టారూ!" అంది పద్మలత నా కొక ఉత్తరాన్ని చేతికిస్తూ. ఆ ఉత్తరాన్ని అందుకొని, ఆమె కళ్లలోకి చూడబోయాను. కన్నీరు నా కంట పడరాదనే ఉద్దేశంతో కాబోలు—పద్మలత తన ముఖాన్ని పక్కకు తిప్పుకొని, చేత్తో కన్నీరు తుడుచుకుంది.

"ఇక వెళ్లొస్తాను" అన్నాను జీరపోయిన గొంతుకతో.

"మంచిది. వెళ్లిరండి, మాస్టారూ!" అంది పద్మలత. దుఃఖావేశంతో ఆమె గొంతుక పూడిపోయిన కారణాన మాట సరిగా రాలేదు. కొంత దూరం వెళ్లి, తిరిగి చూశాను. వాకిట్లో నిలబడి నాకేసి చూస్తున్న పద్మలత, కళ్లు తుడుచుకోవటం లీలగా అవుపించింది.

కొత్త ఊరికి వచ్చాను. రెండురోజులు పాత సంగతులు మరిచాను, ఛార్జి పుచ్చుకునే గొడవతో. ఆ రెండవనాడు పద్మలత ఇచ్చిన ఉత్తరం జ్ఞప్తికి వస్తే, లేచి వెళ్లి, ఉత్తరం విప్పాను.

"మాస్టారూ!

విధిలేని విషమ పరిస్థితుల్లో గత్యంతరంలేక, నేనుగా మీపైన రిపోర్టు వ్రాసి, మీ బదిలీకి ప్రయత్నించవలసి వచ్చింది. అందుకు నేనుకాని, నాయుడుకాని కారణంకాదు. నెరజాణ బన నాయుడి కూతురు రమాసుందరి కారణ మందుకు. నాయుడు చెప్పినట్టు మీరుగనక నన్ను పంచాయతీ ఎన్నికలలో పోటీ చేయవద్దని మాటమాత్రం అని ఉంటే, మీమాటను అకరాలా పాటించేదాన్ని. రమాసుందరికి 'ప్రెసిడెంట్ గిరీ' పట్టం కట్టేదాన్ని. కాని, రమాసుందరికి ప్రెసిడెంట్ గిరీతోపాటు అంతకంటే అమూల్యమైన మీ హృదయ సింహాసనమూ కావాలి. ప్రెసిడెంట్ పదవేకాదు, ప్రాణ మివ్వమన్నా సంతోషంగా సమ్మతిస్తాను కాని, మిమ్ము మాత్రం దూరం చేసుకోలేను. మీరు నాయుడుగారింటికి పోయిననాటి రాత్రి—మిత్రుసమానుడైన మా పాలేరు వెంకన్న మీకు తెలియకుండా మీవెంట నాయుడుగారింటికి వచ్చాడు. అక్కడ జరిగిన సకల సంగతులూ చెప్పాడు నాకు.

మీరు ఇక్కడే గనక ఉంటే—రమాసుందరి ఏవో మత్తుమందు చల్లి, మీ హృదయాన్ని తన కైవసం చేసుకుంటుందేమోనన్న అనుమానం నాలో పెనుభూతమైంది. ఆ భీతితోను, తండ్రిలాంటి పాలేరు వెంకన్న సలహాతోను—మీపై లేనిపోని విషయాలన్నీ కల్పించి, రిపోర్టు వ్రాశాను. బదిలీ చేయించాను స్వార్థంతో. నేను చేసిన ఈ పని తప్పైగనక ఐతే తగిన శిక్షను విధించండి. రెండురోజుల అనంతరం మీ సాన్నిధ్యానికి వస్తాను. తుదిమాట—మీరున్న ఊళ్లో మా బాబాయి ఉన్నారు. వారింటికి....మీకోసం వస్తాను.

వందనాలతో—

మీ పద్మలత."

ఉత్తరం ముగించాను. గదిచెంత అడుగుల సవ్వడి అయింది. నా హృదయంలో ఆనందం పొంగింది. కారణం—ఆ అడుగుల సవ్వడి ఎవ్వరిదో నాకే కాదు, మీకుకూడా తెలుసు. ★

## గమనిక

సమీక్షార్థం రెండు ప్రతులు 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు-2'కు పంపవలసిఉన్నది.

—ఎడిటర్